విలేఖర్లు కావలెను

జ్యోతి ప్రభంజనం దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో జిల్లాలకు బ్యూరోలు, స్టాఫ్ రిపోర్టర్‌లు, ఆర్ సి ఇన్చార్జ్‌లు, మండల రిపోర్టర్‌లు కావలెను.

సంప్రదించ వలసిన నెంబర్:

7095999737,9908103501



PRGI NO:TGTEL/26/A6501

# జ్యోతి ప్రభంజనం

తెలుగు దిన పత్రిక

సంపుటి :01 సంచిక:11 ఎడిటర్: రాపోలు లింగస్వామి 11 -09 -2026 శుక్రవారం

Printed/:Rangareddy , Published By: Hyderabad , Nalgonda, Rangareddy, Mahaboobabad, Medak,worangal,Nizamabad, Adilabad,Karimnagar,Kammam, పేజీలు:4 వెల: 2-00


## సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సీఎల్పీ సమావేశం..



హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన అసెంబ్లీ కమిటీ హాల్లో జరిగిన కాంగ్రెస్ శాసనసభా పక్ష సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహం, ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టడం వంటి అంశాలపై చర్చించారు. అలాగే ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యాచరణపైనా చర్చలు జరిగాయి.

**బీఆర్ఎస్ కుట్రను తిప్పికొట్టారు**

ఈ సందర్భంగా శాసనసభను సజావుగా సాగనివ్వకుండా ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ కుట్ర చేసిందని సీఎం రేవంత్ ఆరోపించారు. ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ అధ్యక్షతన అసెంబ్లీ కార్యకలాపాలను అడ్డుకునే వ్యూహం రూపొందించారని విమర్శించారు. అధికారం కోల్పోయినా వారు అహంకారం వీడలేదని మండిపడ్డారు. పోలీసు సిబ్బందిలో కేటీఆర్‌కు తాను కనిపించినట్టు ఉన్నానని, అంత ఆక్రోశంతో వారిపై ఆయన దాడులు చేశారని పేర్కొన్నారు. పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులపై అనుచితంగా వ్యవహరించారని, మహిళా అధికారుల ఎదుట చొక్కాలు విప్పి ఇబ్బంది కలిగించారని మండిపడ్డారు. శాసనసభాపతినీ అత్యంత అభ్యంతరకరంగా దూషించారని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ నుంచి రాజకీయంగా ఎదిగి ఆ పార్టీకి నష్టం చేకూర్చేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని సీఎం విమర్శించారు. కాంగ్రెస్ అవకాశం ఇవ్వకపోతే సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి రాష్ట్రస్థాయి నాయకులుగా ఎదిగేవారా? అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ కుట్రలను బలంగా తిప్పికొట్టి ప్రభుత్వానికి అండగా నిలిచారంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను రేవంత్ రెడ్డి అభినందించారు.

## ఇందిరమ్మ ఇల్లుకు రూ.5 లక్షలు సరిపోవు..

పేదలకు ఇస్తున్న ఇందిరమ్మ ఇండ్లకు కాంగ్రెస్ సర్కార్ ఇస్తున్న రూ.5 లక్షలు సరిపోవని ఆ పార్టీ ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి స్వయంగా స్పష్టం చేశారు. శాసనసభలో ఈ విషయమై కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ఇల్లు నిర్మాణ ఖర్చు రూ.10 లక్షల కంటే తక్కువ ఎక్కడా అయితలేదు.. ఇప్పుడు నిర్మాణ వ్యయం చాలా పెరిగింది.. రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణ కార్మికుల సమస్య ఏర్పడ్డది. తక్కువలో తక్కువ ఎక్కడైనా సరే మేస్త్రీలు, లేబర్ చార్జీలకే రూ.3-4 లక్షలు తీసుకుంటున్నారు. అంతకంటే తక్కువ ఎవరూ అడుగుతలేరు.. మనం ఇన్ని చదరపు అడుగుల్లో కట్టాలని రూల్స్ పెట్టినం. కానీ కన్‌స్ట్రక్చర్ మెటీరియల్ ధర కూడా పెరిగిపోయిందన్నారు. సడెన్‌గా ఇల్లు కట్టేసరికి ట్రాక్టర్‌లో ఇసుక తెచ్చుకోవాలన్నా, మెటల్ ధర, లేబర్ ఛార్జీలు పెరిగిపోయాయి. ఈ క్రమంలో రూ.5-7 లక్షల్లో అయ్యేది కాస్తా.. రూ.10-15 లక్షల మధ్యన ఖర్చవుతుంది. ఇది ఎక్కడ చెక్ చేసినా రూ.10 లక్షల కంటే తక్కువ ఎక్కడా అయితలేదన్నారు.



## ఈనెల19న కోదాడలో మెగా జాబ్ మేళా

సూర్యాపేట జిల్లాతో పాటు ఉమ్మడి నల్లగొండ, పొరుగున ఉన్న ఖమ్మం జిల్లాలకు చెందిన నిరుద్యోగ యువతకు విస్తృతమైన ఉపాధి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో ఈనెల 19వ తేదీ శనివారం కోదాడలో భారీ స్థాయిలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు.

## ఆర్టీసీని నిర్వీర్యం చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం

హైదరాబాద్, సెప్టెంబర్ 10: ఆర్టీసీ పేద ప్రజలకు లైఫ్ లైన్ లాంటిదని తెలంగాణ రోడ్డు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకార్ అభివర్ణించారు. గురువారం అసెంబ్లీలో ఆర్టీసీపై సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. హైదరాబాద్‌లో మినీ ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని చూస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ నగరంలో 540 ఎలక్ట్రికల్ బస్సులు నడుస్తున్నాయని వివరించారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన రోజే అసెంబ్లీ నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామని గుర్తు చేశారు.



## మంత్రి తుమ్మలపై ఎమ్మెల్యేల ప్రశంసలు

హైదరాబాద్: మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పనితీరుపై బీజేపీ ఎమ్మెల్యేలుపాయల శంకర్,రాకేష్ రెడ్డి ప్రశంసలు కురిపించారు. మంత్రిగా తుమ్మల చాలా బాగా పనిచేస్తున్నారని. తాము ఇలాంటి మంత్రిని చూడలేదని పేర్కొన్నారు. ఎప్పుడైనా ఫోన్ చేసినా తుమ్మల



స్పందిస్తారని. ఆదివారం రోజున కూడా అందుబాటులో ఉంటారని తెలిపారు. పనిలో ఉన్న సమయంలో ఫోన్ ఎత్తలేకపోయినా తిరిగి కాల్ చేసి మాట్లాడతారని చెప్పారు. పార్టీలు వేరైనా ప్రజలకు మంచి చేస్తే మంచి అని చెప్పాల్సిందేనని ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు. ఏదైనా సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్తే ఓపికగా విని. దాని పరిష్కారం కోసం ఫాలోఅప్ చేస్తారని బీజేపీ ఎమ్మెల్యేలు తెలిపారు. సమస్య పరిష్కారం అయ్యే వరకూ సంబంధిత అధికారులతో మాట్లాడటంతో పాటు.. మళ్లీ ఫోన్ చేసి పరిస్థితిని వివరిస్తారని చెప్పారు. ఎప్పుడు సమస్య పరిష్కారం అవుతుందో కూడా ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తారని పేర్కొన్నారు. కొత్తగా ఎన్నికైన సభ్యులు, తోటి మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావును ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

### శాసన మండలి నుంచి బీఆర్ఎస్ సభ్యుల వాకౌట్

హైదరాబాద్, సెప్టెంబర్ 10: తెలంగాణ శాసనమండలి నుంచి ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీ సభ్యులు వాకౌట్ చేశారు. గురువారం మండలి ప్రారంభమైన తర్వాత 22ఎపై చర్చించాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు పట్టుబట్టారు. అందుకోసం వాయిదా తీర్మానాన్ని ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనను శాసనమండలి చైర్మన్ తిరస్కరించారు. దాంతో బీఆర్ఎస్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. చైర్మన్ పోడియం వద్దకు చేరుకున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. పేపర్లు చించి గాలిలోకి ఎగరేశారు. అనంతరం మండలి నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించిన బీఆర్ఎస్ సభ్యులు బయటకు వెళ్లిపోయారు.

## ఢిల్లీకి బయలుదేరిన బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు..

బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి,



కోవ లక్ష్మి ఢిల్లీకి బయలుదేరారు. అసెంబ్లీ ప్రాంగణంలో వారి మీద జరిగిన దాడిపై జాతీయ మానవ హక్కుల కమిషన్, జాతీయ మహిళా కమిషన్లకు ఫిర్యాదు చేయనున్నారు. అసెంబ్లీ వద్ద మాజీ మంత్రులు, బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి పట్ల పోలీసులు దౌర్జన్యానికి పాల్పడిన ఘటన చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. మహిళా ఎమ్మెల్యేలని కూడా చూడకుండా కర్కశంగా వ్యవహరించిన పోలీస్ యంత్రాంగం సబితా ఇంద్రారెడ్డి జుట్టు పట్టుకొని అమానుషంగా ప్రవర్తించారు. అంతటితో ఆగకుండా నలుపు రంగు చీర ధరించి అసెంబ్లీకి వెళ్తున్న సునీతా లక్ష్మారెడ్డి చీర లాగి అవమానించారు. ఖాకీల దౌర్జన్యంతో ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అసెంబ్లీ ముందు కంటతడి పెట్టుకున్న దృశ్యాలు కాంగ్రెస్ సర్కార్ పాలనలో ప్రజలతో ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు, మహిళా ఎమ్మెల్యేలకే రక్షణ కరువైందని చెప్పకనే చెబుతున్నాయి.

## బసవన్నల పండుగ.. అన్నదాతతో పెనవేసుకున్న బంధం

నస్పూర్(మంచిర్యాల): వ్యవసాయ రంగంలో కీలక భూమికను పోషిస్తూ ఆరుగాలం రైతన్నల జీవితంతో పెనవేసుకుని, సేద్యంలో ప్రకృతితో పాటు పశు పక్ష్యాదులపై ఆధారపడి తమ సాగులో సాయపడిన వాటిన్నింటిపై ఆపేక్షను కలిగి ఉంటాడు అన్నదాత. పంటల సాగులో సాయం చేసిన పశు సంపదను దేవుడిగా పూజించడం రైతన్నల మహోన్నత ప్రేమకు నిదర్శనం. సిరులు పండించే నేలతల్లిని భూమాతగా, వానను వరుణ దేవుడిగా రైతన్నలు పూజించడం తరతరాలుగా ఆనవాయితీగా వస్తోంది. పంటల సాగులో తోడుగా నిలిచిన పంచభూతా లతో పాటు కాడెద్దులను నందీశ్వరులుగా భావించి రైతులు ప్రత్యేక పూజలు చేస్తారు. గ్రామీణ ప్రాంత అస్థిత్వాన్ని, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుతూ భావితరాలకు విడమరిచి చెప్పే పద్ధతిని ఎల్లప్పుడు రైతన్నలు పాటిస్తున్నారు. వ్యవసాయ రంగంలో ఆరుగాలం శ్రమించే రైతన్నకు బాసటగా నిలిచిన ఎద్దుల జతలకు ప్రత్యేకంగా అలంకరణ చేసి పూజలు చేస్తారు. శ్రావణ మాసంలో బహుళ పక్ష అమావాస్య రోజున ఆచరిస్తారు. శ్రావణ మాసం గ్రామాల్లో దేవాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయడం, గ్రామాల్లో ఎడ్లతో ఊరేగింపులు నిర్వహించడంతో ఎద్దుల పండగ వైభవోపేతంగా నిర్వహిస్తారు. శ్రావణ మాసంలో ఆఖరి పండగ ఈ నెల 11న పొలాల అమావాస్యను జిల్లాలో ఆనందోత్సావాల మధ్య నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.



జ్యోతి ప్రభంజనం



# సంపాదకీయం

## తోకముడిచిన సర్కార్

అసెంబ్లీ సమావేశాల తొలిరోజున ప్రతిపక్ష బీఆర్ఎస్ శాసనసభ్యులను రేవంత్ ప్రభుత్వం బయటనే అడ్డుకొన్నది. ఈ సమావేశాల మొదటి రోజునే ప్రభుత్వ వైఫల్యాలను గుర్తు చేసే పదాలను ముద్రించిన నల్లరంగు టీ షర్టులను తొడుక్కొని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ ప్రధాన ద్వారం వద్దకు వచ్చారు. అప్పటికే అక్కడకు చేరుకున్న భద్రతా దళాలు వారిని లోపలి వెళ్లేందుకు అంగీకరించలేదు. స్పీకర్ ఆదేశాల మేరకు ఇక్కడే ఆపేస్తున్నామని పోలీసులు వారితో అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీ లోపలికి అనుమతించకపోవడానికి స్పష్టమైన కారణం లేదు. అవే ఆహార్యాలతో వారు అసెంబ్లీలో అడుగుపెట్టినప్పుడే సభ నిబంధనలను ఉల్లంఘించినట్లు అవుతుంది. శాసనసభ, మండలి సభ్యులైన గౌరవ ప్రతినిధులను గేటు బయటే ఆపేయడం వారి ప్రాథమిక పౌరస్వేచ్ఛకు భంగకరం. భారీగా పోలీసు బలగాలను దింపి ప్రభుత్వం అక్కడ కావాలని ఉద్రిక్తతను సృష్టించింది. సభలోకి వారు వస్తే ప్రభుత్వ వైఫల్యాలపై జరిగే చర్చలో విపక్షాలదే పైచేయి అయి, ప్రభుత్వం దోషిగా నిలబడే పరిస్థితి వస్తుందని ముందే గ్రహించిన పాలకపక్షం ఈ యుద్ధ వాతావరణానికి సిద్ధపడింది. ఈ ఘటనకు బీఆర్ఎస్ సభ్యులే కారణమని లేదా పోలీసులే రెచ్చిపోయారని ఉభయ పార్టీల నేతలు ఆరోపణలు చేసుకుంటున్నారు. తొక్కిసలాట జరిగాక స్వీయరక్షణ కోసం ఎవరు ఎవరినీ లక్ష్యపెట్టరు. ఊపిరిని కాపాడుకున్నాక ఏదైతే అది అనే తెగింపు అందరిలో వస్తుంది. ఈ క్రమంలో ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కిందపడిపోయారు. వారిని రక్షించే క్రమంలో ఎవరినైనా నెట్టేయక తప్పదు. వారు విధుల్లో ఉన్న పోలీసులా? అనేది తర్వాతి విషయం అవుతుంది. మామూలుగానే వచ్చిన బీఆర్ఎస్ మహిళా శాసనసభ్యులకు పోలీసులు ముందుజాగ్రత్తగా తగిన భద్రతా ఏర్పాట్లు చేయలేదు. కనీసం వారిని సభా ప్రాంగణంలోకి అనుమతించలేదు. దీంతో వారు ఇబ్బందులపాలై కన్నీరు పెట్టుకోవాల్సి వచ్చింది. ప్రభుత్వం ఏ విచారణకు ఆదేశించినా జరిగిన అవమానం మాత్రం చెరిగిపోదు. కాగా, తెలంగాణ అసెంబ్లీలో ఎంఐఎం శాసనసభా పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ అసెంబ్లీ ఎదుట జరిగిన తొక్కిసలాటపై మాట్లాడుతూ.. బీజేపీ సభ్యులు సభలో ప్లకార్డులు ప్రదర్శించినప్పుడు అభ్యంతరం చెప్పని ప్రభుత్వం బీఆర్ఎస్ సభ్యులను ఎలా ఆపుతుందని నిలదీశారు. ప్లకార్డులపై రాసినా, టీ షర్టులపై రాసుకున్నా ఒకటే కదా..కానీ రెండింటినీ విడిగా చూసి ప్రభుత్వం వివక్ష ప్రదర్శించిందని ఆయన అన్నారు. అసెంబ్లీ హాలులో సభ్యులెవరూ ప్లకార్డులు ప్రదర్శించకూడదని నిబంధనావళిలో ఉన్న విషయం అందరికీ తెలిసిందే. కానీ ఉల్లంఘన మన దేశంలో నిత్యకృత్యమైపోయింది. సభ్యుల విపరీత ప్రవర్తనకు సభలు రంగస్థలాలు అయ్యాయి. 'వీరా..మన ప్రజాప్రతినిధులు, దేశ శాసనకర్తలు' అని సిగ్గుపడిన సందర్భాలూ ఉన్నాయి. గత పన్నెండేండ్ల కాలంలో పార్లమెంట్‌లో కాంగ్రెస్ సభ్యులు ఎన్నోమార్లు ప్లకార్డులు పట్టుకొని సభాపతి పోడియం వద్ద ప్రదర్శించారు. చండీగఢ్‌లో గత నెల 27న జరిగిన అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో కాంగ్రెస్ సభ్యులు ప్లకార్డులు పట్టుకొని నినాదాలు ఇచ్చారని హర్యానా ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ విచారం వ్యక్తం చేశారు. నేడు పాలక పక్షాన ఉండి సభా మర్యాదల గురించి సుద్దులు పలుకుతున్నవారికి కూడా ఉల్లంఘనల ఘన చరిత్ర ఉన్నది. 2017లో ఉమ్మడి రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆనాడు టీడీపీ సభ్యుడైన రేవంత్‌రెడ్డి గవర్నర్ ప్రసంగ సమయంలో నినాదాలతో సభా మర్యాదలను ఉల్లంఘించారు. 2018 మార్చిలో బీఆర్ఎస్ శాసనసభ, మండలి సంయుక్త సమావేశంలో గవర్నర్ నరసింహన్ ప్రసంగాన్ని అడ్డుకొంటూ కాంగ్రెస్ సభ్యులు రైతుల ఆత్మహత్యలపై ప్లకార్డులు ప్రదర్శిస్తూ హంగామా చేశారు. అక్కడితో ఆగకుండా ఆనాటి కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి తన హెడ్‌ఫోన్‌ను విసిరికొట్టగా అది సభాపతి స్వామిగౌడ్ కుడికంటికి తాకి కార్నియా దెబ్బతిన్నది. తొలిరోజు తొక్కిసలాటలో బీఆర్ఎస్ అగ్రనేతలు హరీశ్‌రావు, జగదీశ్వర్‌రెడ్డి కింద పడిపోవడం, పోలీసులు వారిని కాపాడే ప్రయత్నం చేయక పోవడం, ఈలోగా వారిపై కొందరు కాళ్లు వేయడంతో పరిస్థితి పూర్తిగా అదుపు తప్పింది. పట్టరాని కోపంలో ఒక సభ్యుడు ఆవేశంగా ఒక చెడ్డ మాట మాట్లాడారు. మీకు ఆదేశాలు ఇచ్చిందెవరు? అనే క్రమంలోనే ఆ మాట వచ్చింది. కానీ ఎవరి పేరును కూడా ఆయన ఎత్తలేదు. కానీ ఆ సభ్యుడు తన తప్పును అంగీకరించారు. అయితే అదే మాటను పట్టుకొని రాద్ధాంతం చేసి, కాంగ్రెస్ తమ పార్టీ శ్రేణులను రోడ్లపైకి దించింది. కులం కార్డుకు రెక్కలు తొడిగింది. ప్రభుత్వం తమ తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికి ఎర్రవల్లిలోని బీఆర్ఎస్ అగ్రనేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నివాసం వైపు కాంగ్రెస్ కార్యకర్తలను ఉసిగొల్పింది. 'అసెంబ్లీలో చర్చిద్దాం రండి' అని ప్రతి వేదిక నుంచీ సవాల్ విసిరే ముఖ్యమంత్రి సమయం వచ్చాక విమర్శను ఎదుర్కోలేక బీఆర్ఎస్ సభ్యుల ప్రవేశాన్ని నిరాకరించారు. చివరకు శాంతిభద్రతలపై చర్చ కోరిన ప్రధాన ప్రతిపక్ష సభ్యులను ఈ సమావేశాలకు రానీయకుండా చేశారు. అయితే, ప్రధాన విపక్షం లేని సభా సమావేశాలు నిష్ప్రయోజనమే. హామీల అమలుపై జవాబు లేని ప్రభుత్వం నియంతృత్వ ధోరణిని ప్రదర్శిస్తున్నది.

# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ప్రజల ఐక్యతను కాపాడాలి

ఎల్ బీ నగర్, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి,సెప్టెంబర్ 10:చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని స్మరించుకుంటూ ఆమె ఆశయ సాధన



కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం. చంద్రమోహన్, జిల్లా కమిటీ సభ్యులు కీసరి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆధ్వర్యంలో చింతలకుంటలో చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సభకు సీపీఎం ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ కీలక పాత్ర పోషించారని తెలిపారు. జమీందారీ, జాగీర్దారీ, భూస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా పేద ప్రజల తరపున ఆమె ధైర్యంగా పోరాడారని పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం ద్వారా వేలాది గ్రామాలు విముక్తి పొందడంతో పాటు లక్షలాది ఎకరాల భూమిని పేదలకు పంచిన ఉద్యమంలో ఐలమ్మ వంటి పోరాట యోధులు కీలక పాత్ర పోషించారని అన్నారు. నాటి కాలంలో జాగీర్దారులు, భూస్వాములు పేదలు, వృత్తిదారులు, ఇతర ప్రజలతో వెట్టిచాకిరీ చేయించుకునేవారని, దానికి వ్యతిరేకంగా తెలంగాణలో ఆంధ్ర మహాసభ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడిందని వివరించారు. నిజాం పాలనలో ప్రజలు తీవ్ర దోపిడీకి గురయ్యారని, పంట దిగుబడిలో అధిక భాగాన్ని పన్నుల రూపంలో వసూలు చేసేవారని తెలిపారు. ఈ దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలు సాగించిన పోరాటం రజాకార్ల దౌర్జన్యాలను ఎదుర్కొని, హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం కావడానికి దోహదపడిందన్నారు. అయితే నేటి బీజేపీ పాలకులు తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించి, దానిని వి ాం ద ా ? వ ు ు న్ల ం పోరాటంగా చిత్రీకరిస్తూ ప్రజల్లో తప్పుడు సంకేతాలు పంపుతున్నారని వారు విమర్శించారు. చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలను తిప్పికొట్టి ప్రజల మధ్య ఐక్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. చాకలి ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆమెకు అందించే నిజమైన నివాళి అని, ఆమె పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం. చంద్రమోహన్, జిల్లా కమిటీ సభ్యులు కీసరి నర్సిరెడ్డి, ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య, హయత్‌నగర్ సర్కిల్ నాయకులు చింతపల్లి కృష్ణయ్య, ముషం నరహరి, నాయుని శ్రీనివాస్, బూరెల్ల భాస్కర్, చెన్నారం మల్లేశం, రాధ, డీవైఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి రమావత్ అజినాయక్, మన్యం రాధమ్మ, లింగస్వామి, కిరణ్, దండు అంజమ్మ, కలమ్మ, లాట్ల లక్ష్మణ్, యాదయ్య, కొండపల్లి చంద్రమౌళి, పి. జయమ్మ, ప్రేమలత, కే. అంజమ్మ, లక్ష్మి, కవిత, నరసమ్మ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి

**మండల సమైక్య భవన నిర్మాణానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారం**
**వేలేరు సర్పంచ్ బిల్లా యాదగిరి**

రంగారెడ్డి జిల్లా, జ్యోతి ప్రభంజనం,ప్రతినిధి, సెప్టెంబర్ 10, వేలేరు:వేలేరు మండల కేంద్రంలోని మండల సమైక్య భవనంలో మహిళా మండల సమైక్య 10వ వార్షిక మహాసభను ఘనంగా నిర్వహించారు. ఏపీఎం అనిత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహాసభకు మండల సమైక్య అధ్యక్షురాలు రేణుక అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బిల్లా యాదగిరి హాజరై మహిళా సంఘాల సభ్యులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా సర్పంచ్ బిల్లా యాదగిరి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. మహిళా సంఘాల ద్వారా మహిళలకు ఆర్థికంగా చేయూతనందిస్తూ వివిధ రకాల



సబ్సిడీ రుణాలను అందిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో మండలంలోని వివిధ గ్రామాల్లో మహిళా సంఘాల భవనాల నిర్మాణం చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు. అలాగే మండల కేంద్రంలో మండల సమైక్య భవన నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ పూర్తయిన వెంటనే ఎమ్మెల్యే సహకారంతో భవన నిర్మాణాన్ని చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. మహిళా సంఘాల కార్యకలాపాలను మరింత విస్తృతం చేసేందుకు ప్రభుత్వం మండల సమైక్యకు బస్సును కూడా అందజేసిందని తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి రంగంలో ముందుకు సాగేందుకు ప్రభుత్వం అందిస్తున్న రుణాలు, ఇతర ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వేలేరు మండల అభివృద్ధికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నారని, అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని సర్పంచ్ పేర్కొన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన, స్వయం ఉపాధి, సంఘాల బలోపేతానికి అందరూ సమష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం మహిళా మండల సమైక్య కార్యవర్గం ఆధ్వర్యంలో సర్పంచ్ బిల్లా యాదగిరిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల సమైక్య కార్యదర్శి రాజమ్మ, సీసీలు రమాదేవి, నాగమణి, సతీష్, మండల సమైక్య కార్యవర్గ సభ్యులు, మండలంలోని వివిధ గ్రామాల వీఓ అధ్యక్షులు, కార్యదర్శులు, మహిళా సంఘాల ప్రతినిధులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రవేశానికి గడువు పెంపు

భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ మొదటి సంవత్సరము ప్రవేశానికి ఈనెల సెప్టెంబర్ 30 వరకు గడువు పెంచినట్లు శ్రీ రామచంద్ర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల( అటానమస్) ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ పి.పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరము ఓపెన్ ఇంటర్ డిప్లమా ఐటిఐ పూర్తి చేసిన వారు మొదటి సంవత్సరానికి అడ్మిషన్ పొందవచ్చు అని పేర్కొన్నారు. కొయ్య చెంచు దివ్యాంగులకు ఎటువంటి ఫీజు ఉండదని చెప్పారు. అదేవిధంగా ద్వితీయ సంవత్సరము తృతీయ సంవత్సరము చదువుతున్న విద్యార్థులు యూనివర్సిటీ ఫీజులు ఈ నెల 30 వరకు చెల్లించాలని వివరించారు.

## ధర్మం ? అధర్మం

అధర్మం ముందుగా ఎవరిని పైకి ఎత్తుతుందో,
కాలం మొదటగా వారినే కిందకు దించుతుంది.
అన్యాయం వేసిన పునాదులపై కట్టిన రాజ్యం,
ఎంత ఎత్తైనా చివరికి కూలిపోతుంది.
అబద్ధం కొంతకాలం నిజాన్ని ఓడించవచ్చు,
కానీ శాశ్వతంగా సత్యాన్ని బంధించలేదు.
మోసం నీడలా మన వెంట నడిచినా,
ఒకరోజు వెలుగులో దాని రూపం బయటపడుతుంది.
అధర్మం ఇచ్చే విజయం విషపు తేనెలాంటిది,
మొదట తీయగా ఉండి చివరికి ప్రాణమే తీస్తుంది.
ధర్మం నడిచే దారి ముళ్లతో నిండినా,
ఆ దారిలో వేసిన అడుగులు గౌరవమవుతాయి.
న్యాయం నెమ్మదిగా నడిచినా,
దాని తీర్పు మాత్రం తప్పకుండా చేరుతుంది.
కాలం ఎవరి పక్షానా శాశ్వతంగా నిలవదు,
కర్మల తూకంలో ప్రతి మనిషినీ తూచుతుంది.
ఇతరుల కన్నీళ్లపై కట్టిన సింహాసనం,
ఒకరోజు అదే కన్నీళ్లలో మునిగిపోతుంది.
బలంతో దాచిన తప్పులు,
కాలం చేతిలో ఆధారాలుగా మారతాయి.
ధర్మం ఒంటరిగా కనిపించినా,
దాని వెనుక సత్యం అనే సైన్యం ఉంటుంది.



అధర్మం జనసమూహంతో నడిచినా,
చివరి మలుపులో ఒంటరిగానే మిగులుతుంది.
మనిషి ఎత్తు సంపదతో కాదు,
అతని నడకలోని నీతితో కొలవాలి.
కాలచక్రం తిరుగుతూనే ఉంటుంది,
ఎవరినీ శాశ్వతంగా పైకీ కిందకీ ఉంచదు.
అందుకే అధర్మపు దారిని విడిచి,
ధర్మం చూపే బాటలో అడుగులు వేయాలి.
ఎందుకంటే ప్రకృతి ధర్మం ఒక్కటే
అధర్మానికి అంతం,
ధర్మానికి జయం.

రచన : కె.మురళీమోహన్ రాజు, నెల్లూరు.చరవాణి : 9866179385

# తాతా మధును తక్షణమే సస్పెండ్ చేయాలి

### సభాపతిపై అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చావు డప్పుతో నిరసన

ఇబ్రహీంపట్నం, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి,సెప్టెంబర్ 10:గౌరవ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై పరుష పదజాలంతో వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుపై తక్షణవే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ సీనియర్ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదేశాల మేరకు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర దళిత విభాగం పిలుపుతో పెద్ద అంబర్‌పేట్, కుంట్లూర్ డివిజన్ చౌరస్తాలో చావు డప్పు కొట్టి నిరసన వ్యక్తం చేశారు. మాజీ కౌన్సిలర్ గ్యారాల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాటసింగారం సొసైటీ బ్యాంక్ చైర్మన్ కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గ బి–బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సీహెచ్ భాస్కర్‌చారి మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం కల్పించిన అత్యున్నతమైన శాసనసభ పీఠంపై ఉన్న దళిత నాయకుడు, గౌరవ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. అధికారం కోల్పోయామనే అక్కసుతోనే బీఆర్ఎస్ నాయకులు దళిత నాయకత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని వారు ఆరోపించారు. దళిత నాయకత్వం ఎదుగుతుంటే ఓర్వలేక రాజ్యాంగ వ్యవస్థలను కించపరిచే విధంగా మాట్లాడటం సరికాదన్నారు. రాజకీయాలకు అతీతంగా రాజ్యాంగ వ్యవస్థల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం కేవలం ఒక వ్యక్తికి జరిగిన అవమానం కాదని, దళిత సమాజంతో పాటు ప్రజాస్వామ్య వ్యవస్థకు అవమానమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. సభా మర్యాదలకు విరుద్ధంగా వ్యవహరించిన ఎమ్మెల్సీ తాతా మధుపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనుచిత వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నాయకత్వం స్పందించి క్షమాపణ చెప్పాలని వారు కోరారు. ఇటువంటి వ్యాఖ్యలను ప్రోత్సహిస్తున్నారంటూ బీఆర్ఎస్ అధినేత, ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్‌పై కూడా కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేశారు. కేసీఆర్ తక్షణమే ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద అంబర్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు పండుగల రాజు, కుంట్లూర్ డివిజన్ అధ్యక్షుడు భీమగోని భాస్కర్ గౌడ్, పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధంకి కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు రాజ్‌కుమార్, పాలడుగు నాగార్జున, సీనియర్ నాయకులు ఎరుకల భాస్కర్ గౌడ్, సుప్రసన్నారెడ్డి, చేగురు వెంకటేష్, రాజేంద్రప్రసాద్ గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిగౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నర్సింగ్, శ్రీనివాసరెడ్డి, సుర్వి ప్రవీణ్ గౌడ్, గిరీష్, మహంత, గుడ్ల రవి, శివ తదితరులు పాల్గొన్నారు.






# మానవ మేధస్సుకు ఏఐ ప్రత్యామ్నాయం కాదు

### అది మన ఆలోచనా శక్తిని రెట్టింపు చేసే సాధనం మాత్రమే
### విద్యార్థులు సాంకేతికతను విచక్షణతో వినియోగించాలి

సికింద్రాబాద్, జ్యోతి ప్రభంజనం,సెప్టెంబర్ 10 :కృత్రిమ మేధస్సు (ఏఐ) ఎంత అభివృద్ధి చెందినా మానవ మేధస్సుకు ఎప్పటికీ ప్రత్యామ్నాయం కాదని మాజీ మంత్రి, జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ మాజీ ఉపాధ్యక్షుడు, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు మర్రి శశిధర్‌రెడ్డి అన్నారు. ఏఐని మానవ మేధస్సు శక్తిని మరింత పెంచే సాధనంగా మాత్రమే చూడాలని విద్యార్థులకు సూచించారు. నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ 21వ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మర్రి శశిధర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఆలోచనకు ఏఐ ప్రత్యామ్నాయం కాదుప్రస్తుతం కొందరు విద్యార్థులు కృత్రిమ మేధస్సుపై అతిగా ఆధారపడుతున్నారని శశిధర్‌రెడ్డి అన్నారు. ఏఐ ద్వారా సమాచారం సులభంగా లభించినప్పటికీ.. స్వయంగా ఆలోచించడం, విశ్లేషించడం, నిర్ణయాలు తీసుకోవడం వంటి మానవ మేధస్సు సామర్థ్యాలను అది భర్తీ చేయలేదన్నారు. ఏఐ మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయం కాకుండా దాని సామర్థ్యాన్ని రెట్టింపు చేసే సాధనంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. రెండు వైపులా పదునున్న కత్తిసాంకేతిక పరిజ్ఞానం రెండు వైపులా పదునున్న కత్తి వంటిదని ఆయన వ్యాఖ్యానించారు. దానిని సద్వినియోగం చేసుకుంటే ఎంతో ప్రయోజనం ఉంటుందని, అదే సమయంలో విచక్షణ లేకుండా ఉపయోగిస్తే ప్రతికూల ఫలితాలు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. ఏఐని ఎలా ఉపయోగించుకోవాలో విద్యార్థులు ఇప్పటి నుంచే అవగాహన పెంచుకోవాలని సూచించారు. సాంకేతికతను తమ జ్ఞానాన్ని పెంచుకోవడానికి, సృజనాత్మకతను మెరుగుపరుచుకోవడానికి వినియోగించుకోవాలని హితవు పలికారు. ఏఐ వినియోగ విధానంపైనే రానున్న తరాల భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్, శాసన మండలి సభ్యుడు మల్క కొమరయ్య, పెద్దపల్లి పార్లమెంటు సభ్యుడు గడ్డం వంశీకృష్ణతో పాటు పాఠశాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



# సేవకు చిరునామా..డాక్టర్ మద్దెల శివకుమార్

### – ఉపాధ్యాయుడుగా సేవలు చిరస్మరణీయం
### – ఘనంగా మద్దెల శివకుమార్ సన్మాన మహోత్సవం

భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):సేవకు చిరునామాగా ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ నిలవడం అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. 36 సంవత్సరాల సుదీర్ఘమైన ఉపాధ్యాయ సేవలనందించి ఇటీవలే పదవి విరమణ పొందిన ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ కు గురువారం నిమ్మలగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నుండి గ్రామ పెద్దలు ప్రజలు ఘనంగా సన్మాన మహోత్సవం ఏర్పాటుచేసి సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఉత్తమ ప్రతిభావంతుడుగా సమాజ సేవకుడిగా అందించిన సేవలు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ మన తెలంగాణ రాష్ట్రా నికే గర్వకారణం అని కొనియాడారు. అనంతరం కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ గణేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వసుపులేటి వీరబాబులు మాట్లాడుతూ మద్దెల నిరంతర సేవా తత్పరుడిగా వృత్తిపరమైన ఉత్తమ ఉపాధ్యాయుడిగా విశిష్టమైన సేవలను అందించడంతో పాటు విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలోనూ, పాఠశాల అభివృద్ధిలోనూ కీలకపాత్ర పోషించడం అభినందనీయం అన్నారు. ఇటు కవిగా రచయితగా గాయకుడిగా అటు కళారంగాన్ని పోషిస్తూ గొప్ప అంబేద్కర్ వాదిగా సామాజిక న్యాయం కోసం దళితుల బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిత్య పోరాట యోధుడిగా స్వప్రయోజనాన్ని కాంక్షిం చకుండా తన సొంత డబ్బులు ఖర్చు పెట్టి ఎన్నో వ్యయ ప్రయాసలతో పేదవారిని అవసరత ఉన్న వారిని ఆదుకోవడం మరువలేనిదన్నారు. సుజాతనగర్ మండల విద్యాశాఖాధి కారిణి లీల,పి ఆర్ టి యు సంఘ రాష్ట్ర నాయకు లు డి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అన్ని రంగాలలోనూ అత్యంత ప్రతిభాపాటవాలు కలిగిన గొప్ప కళాకారుడు నిత్య సమాజ సేవకుడు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ తరగతి గదిలో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చ దిద్దడమే కాకుండా పాఠశాల అభివృద్ధిలోనుఉపాధ్యాయ సంఘాల నాయకుడిగా అటు విద్యారంగ విలువలను కాపాడడంలోనూ ఇటు ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలోనూ విశిష్టమైన సేవలు అందించారని కొనియాడారు. సమాజంలో ప్రతి ఒక్కరికి అండగా నిలబడి చేయూతనిచ్చే ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ విశిష్టమైన సేవలను వారి జీవితాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిస్తూ వారి భావి జీవితం ఆరోగ్యం ఆనందం ఐశ్వర్యంతో విలసిల్లాలని వారి ఆశయాల ఆకాంక్షల నెరవేర్పుతో విజయవంతంగా ముందుకు సాగాలని అభిలషించారు. ఈ ఘనమైన సన్మాన కార్యక్రమానికి నిమ్మలగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు ఎండి షఫీ అహ్మద్ అధ్యక్షత వహించారు. ఆచార్య డాక్టర్ మద్దెలకు అత్యంత సన్నిహితులు అయిన నిమ్మల గూడెం ఆర్.ఎం.పి వైద్యులు అభ్యుదయ వాది తుంపురి శ్రీనివాస్, కార్పొరేషన్ ఉద్యోగి అయిన అభ్యుదయ వాది బండి రమేష్ లు అత్యంత వ్యయ ప్రయాసలతో ఈ కార్యక్రమానికి సారథ్యం వహించారు. ఈ ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ పదవీ విరమణ సన్మాన మహోత్సవ కార్యక్రమంలో పి ఆర్ టి యు జిల్లా అధ్యక్షులు బి రవి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, జహంగీర్ షరీఫ్, జిల్లా నాయకులు కాంప్లెక్స్ అసిస్టెంట్ సెక్రటరీ రాందాస్, కొత్తగూడెం కార్పొరేటర్ సాగర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎండి షఫీ అహ్మద్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్‌శాంత కుమారి, సుజాతనగర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగమణి, ఆర్ పి లు శేఖర్, పూనం శ్రీనివాస్, సి అర్ పిలు వంశీ, అప్పు నాయక్,సుమలత, కళా రంగ కోవిదులు స్వర సంగీత విద్వాన్ కలవల రాందాస్, అపరబాలు అల్లిశంకర్, క్రీస్తు సువార్తికులు దైవజనులు బ్రదర్ కేదాసి పీటర్ బాబు, టి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుండా రమేష్, జిల్లా అధ్యక్షులు మచ్చ పృథ్వీరాజ్, అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర మైనార్టీ నాయకులు సల్మాన్ ఖాన్ తోత, రాజేశ్వరరావు నిమ్మలగూడెం మాజీ సర్పంచ్ బండి రమేష్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సహచరులు ఆనందరావు,కుమార్ స్వామి, శ్రీనివాసరెడ్డి, రాజ్యలక్ష్మి, స్వరూప, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు మద్దెల ఆదర్శ్, నాయకులు కేదాసికిరణ్, సుమన్, అఫ్రైమ్ చింటూ, ఈ కార్యక్రమ రథసారథులు ఆర్ఎంపీ డాక్టర్ తుంపురి శ్రీనివాస్, కార్పొరేషన్ ఉద్యోగి బండి రమేష్, గ్రామ పెద్దలు రాఘవులు, బండి వెంకన్న, గ్రామ యువత,పాఠశాల సిబ్బంది లావణ్య, రజిత, నరేష్‌విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

సికింద్రాబాద్: జ్యోతి ప్రభంజనం,సెప్టెంబర్ 10:నిజాం నిరంకుశ పాలన, భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ త్యాగాలు తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయమని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మహంకాళి?సికింద్రాబాద్ జిల్లా ఓబీసీ అధ్యక్షుడు వై.సురేష్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డాక్టర్ కె.లక్ష్మణ్, బీజేపీ నగర అధ్యక్షుడు గుండగోని భరత్ గౌడ్, సికింద్రాబాద్ పార్లమెంట్ కన్వీనర్ టి.రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ కె. లక్ష్మణ్ మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం తెలంగాణ ప్రజలకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమన్నారు. భూస్వాముల దౌర్జన్యాలను ధైర్యంగా ఎదుర్కొని రైతాంగానికి అండగా నిలిచిన ధీరవనితగా ఐలమ్మ చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు. కౌలు భూమిని, పంటను స్వాధీనం చేసుకునేందుకు భూస్వాములు ప్రయత్నించిన సమయంలో ఆమె ఏమాత్రం వెనుకడుగు వేయకుండా ఎదురొడ్డి పోరాడారని తెలిపారు. బీజేపీ నగర అధ్యక్షుడు గుండగోని భరత్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో నైజాం సర్కార్‌ను గడగడలాడించిన వీరనారి చాకలి ఐలమ్మ అని అన్నారు. తెలంగాణ కోసం పోరాడిన అమరవీరులు, ఉద్యమకారులను గౌరవించే సంస్కృతి బీజేపీకే ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర ప్రధాన కార్యదర్శులు మేకల సారంగపాణి, రమేష్ రామ్, ఓబీసీ మోర్చా నాయకులు ముఠా గణేష్, రవీందర్, శీలం శివలింగం, సర్వేష్, మహేందర్ సింగ్, కనకరాజు, సంధ్య లక్ష్మి, మాజీ నగర అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, అంగముత్తు శ్రీనివాస్, మహేష్, వీరు సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# చుంచుపల్లిలో విజయ మినీ పాల డైరీ కేంద్రం

**– ఏర్పాటుకు త్వరితగతిన చర్యలు చేపట్టాలి**
**– భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ సూచన**

భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):చుంచుపల్లిలో విజయ డెయిరీ కోసం ఇప్పటికే స్థలం కేటాయించినందున ఆ స్థలంలో విజయ మినీ పాల శీతలీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసేలా చర్యలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు లక్ష్మీదేవిపల్లిలోని ప్రస్తుత విజయ మినీ పాల శీతలీకరణ కేంద్రం ఉన్న స్థలాన్ని అందుబాటులోకి తీసుకురావాల్సి ఉన్నందున కేంద్రాన్ని చుంచుపల్లికి మార్చే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఇందులో భాగంగా లక్ష్మీదేవిపల్లి మండల కేంద్రంలోని విజయ మినీ పాల శీతలీకరణ కేంద్రాన్ని గురువారం కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి కేంద్రాన్ని చుంచుపల్లికి మార్చే అంశంపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కేంద్రంలో ప్రతిరోజూ జరుగుతున్న పాల సేకరణ శీతలీకరణ ప్రక్రియ అందుబాటులో ఉన్న మౌలిక వసతులు పరికరాల పనితీరు తదితర వివరాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రం పరిధిలో సుమారు 30 గ్రామాలకు చెందిన 400 మంది రైతులు పాల సేకరణకు అనుసంధానమై ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం రోజుకు సుమారు 500 లీటర్ల వరకు పాలు సేకరిస్తుండగా పాల ఉత్పత్తి అధికంగా ఉండే సీజన్‌లో రోజువారీ సేకరణ సుమారు 4,000 లీటర్ల వరకు పెరుగుతుందని వివరించారు. ఉదయం సాయంత్రం నిర్ణీత సమయాల్లో పాలను సేకరించి ఖమ్మం డెయిరీకి తరలిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ కేంద్రంలోని కూలింగ్ ట్యాంక్ స్టోరేజ్ వ్యవస్థ కంప్రెసర్ తదితర పరికరాలను పరిశీలించారు. ప్రస్తుత భవనం పరికరాల పరిస్థితిని పరిశీలించిన కలెక్టర్ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సిన అంశంపై అధికారులతో చర్చించారు. చుంచుపల్లిలో విజయ మినీ పాల శీతలీకరణ కేంద్రం ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే స్థలాన్ని గుర్తించి విజయ డెయిరీ అధికారులకు సూచించినందున కేంద్రం ఏర్పాటుకు అవసరమైన తదుపరి చర్యలను త్వరితగతిన చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. రైతులకు సౌకర్యవంతంగా ఉండే విధంగా కేంద్రాన్ని ఏర్పాటు చేసి,పాల సేకరణ శీతలీకరణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని



ఆదేశించారు.కేంద్రాన్ని మార్చే సమయంలో పాల సేకరణకు ఎలాంటి అంతరాయం కలగకుండా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. నూతన కేంద్రం అందుబాటులోకి వచ్చిన తర్వాత రైతులకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుతో ఈ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు అందుబాటులోకి వస్తాయని అదే సమయంలో విజయ మినీ పాల శీతలీకరణ కేంద్రాన్ని చుంచుపల్లిలో ఏర్పాటు చేయడం ద్వారా రైతులకు కూడా ప్రయోజనం కలిగేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావడంతో పాటు విజయ మినీ పాల శీతలీకరణ కేంద్రాన్ని చుంచుపల్లిలో ఏర్పాటు చేసే పనులను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు.ఈ పరిశీలనలో లక్ష్మీదేవిపల్లి తహసీల్దార్ శిరీష, విజయ డెయిరీ మేనేజర్ సౌజన్య, సిబ్బంది సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక

చిట్యాల,నల్లగొండ: సెప్టెంబర్ 10(జ్యోతి ప్రభంజనం): ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని చిట్యాల మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసినట్లు మండల విద్యాధికారి పానుగోతు సైదానాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి చేసిన కృషి, బోధనలో ప్రతిభ, పాఠశాల అభివృద్ధికి అందించిన సేవలను పరిగణనలోకి తీసుకుని ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.జెడ్పీహెచ్ఎస్ విభాగంలో ఏ. పద్మజ (చిట్యాల), సీహెచ్. శ్రీనివాసులు (వెలిమినేడు), జీ.వీ. హరిప్రసాద్ (వెలిమినేడు), పి. మాధవి (చిన్నకాపర్తి), డి. సూర్యప్రకాష్ (వట్టిమర్తి) ఎంపికయ్యారు. అలాగే ఎంపీపీఎస్ విభాగంలో ఎన్. సరస్వతి (వట్టిమర్తి), ఎన్. సికిందర్ సింగ్ (సుందరయ్యనగర్), కె. వాణి (వెలిమినేడు), నాజీమా సుల్తానా (చిట్యాల), ఎం. ధనలక్ష్మి (చిన్నకాపర్తి), ఆర్. జయంత్ (గుండ్రాంపల్లి) ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనట్లు ఎంఈఓ తెలిపారు.ఎంపికైన ఉపాధ్యాయులను శుక్రవారం చిట్యాల ఎంపీడీఓ కార్యాలయంలో ఘనంగా సత్కరించి అభినందించనున్నట్లు పానుగోతు సైదానాయక్ వెల్లడించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి పలువురు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.



# ఇండ్లు లేని పాతబస్తీ పేదలకు తక్షణమే మంజూరు చేయాలి

**పేదల ఆగ్రహానికి గురికావద్దు ఇందిరమ్మ ఇళ్ల హామీనీ అమలు చేయాలి**
**– సీ పీ ఎం రాష్ట్ర నేత ఎం డి అబ్బాస్**
**హైదరాబాద్ కలెక్టర్ ఆఫీస్ వద్ద సీ పీ ఎం బారీ ధర్నా**

హైదరాబాద్, జ్యోతి ప్రభంజనం, సెప్టెంబర్ 10:– హైదరాబాద్ పాత బస్తీ లోనీ 7 నియోజకవర్గాల ఇండ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు తక్షణమే మంజూరు చేయాలని, ఈ ప్రాంతం లోని ప్రభుత్వ భూముల్లో ఒక్కో కుటుంబానికి 120 గజాల స్థలం కేటాయించాలని, లేదా ఇప్పటికే నిర్మాణం అయిన ఇండ్లను వెంటనే వీరికి కేటాయించాలని భారత కమ్యూనిస్ట్ పార్టీ (మార్క్సిస్ట్) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం డి అబ్బాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నేడు లక్డికపూల్ లోని హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయం వద్ద పేద ప్రజలు సీ పీ ఎం హైదరాబాద్ సౌత్ జిల్లా కమిటీ



ఆధ్వర్యాన బారీ ధర్నా చేపట్టారు. ఈ ధర్నా కు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన లో దరఖాస్తు చేసుకొని 3 సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న పేదలు ఇండ్ల కిరాయి కట్టలేక అప్పులపాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మరో వైపు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 2019 లోనే ఇండ్లు లేని వారందరికీ ఇండ్లు నిర్మించి ఇచ్చినట్లు అబద్ధాలు చెప్తున్నదని,కేంద్ర బీజేపీ విధానాలవల్ల గ్యాస్ సిలిండర్ ధరలు రెట్టింపు అయ్యాయని, ఇటీవల నూనె,చక్కెర,చింతపండు మరియు ఉల్లిగడ్డల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని ఫలితంగా పేదల ఇంటి బడ్జెట్ తలకిందులైందని ,దీనికి కారణం పాలకులు అవలంబిస్తున్న దోపిడీవర్గాలను ప్రోత్సహించే కార్పొరేట్ విధానాలనీ ఆయన పేర్కొన్నారు. పేదలకు కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన హామీ అమలు చేయాలి" నిర్మాణం పూర్తయిన ఇండ్లు తక్షణమే అర్హులైన వారికి కేటాయించాలి! కేటాయించాలి!! సీ పీ ఎం జిందాబాద్! జిందాబాద్!! అంటూ ఇచ్చిన నినాదాలతో ఆప్రాంత మంతా మారుమ్రోగింది. పక్కనే సమావేశాలు జరుగుతున్న అసెంబ్లీ ఉండడం తో పోలీస్ అధికారులు బారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.జాయింట్ కలెక్టర్ హామీ : ధర్నా జరుగుతున్న విషయం తెల్సుకున్న అధికారులు సీ పీ ఎం ప్రతినిధి బృందం తో జాయింట్ కలెక్టర్ సమక్షంలో చర్చించారు. ప్రజాపాలనలో 2 లక్షల పే దలు ఇండ్లు లేని వారున్నారని గుర్తించామని,రానున్న 2 నెలల్లో ఎల్ –2 దశలో ఉన్న దరఖాస్తుదారులకు ఇండ్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. మిగతా సమస్యలు దశలవారీగా పరిష్కరిస్తామన్నారు.– జాయింట్ కలెక్టర్ హామీ మేరకు ధర్నాను విరమించారు.– ఈ ధర్నా లో సీ పీ ఎం హైదరాబాద్ సౌత్ జిల్లా నేతలు ఎల్.కోటయ్య,అబ్దుల్ సత్తార్,ఎం.బాలు,ఎస్.కిషన్, ,పి. నాగేశ్వర్,ఎం.మీనా, ఏ.కృష్ణ, జి.విఠల్ ,బాబర్ ఖాన్,ఎం శ్రావణ్,పి.శశికళ,అబ్దుల్ లతీఫ్,మరియు చాంద్రాయణగుట్ట,చార్మినార్, బహదూర్ పురా,మలక్ పేట్,యాకత్పుర తదితర ప్రాంతాలనుండి ప్రైవేట్ కిరాయి బాధిత ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# 1000 రోజుల్లో రూ.1000 కోట్ల అభివృద్ధి పనులు..

**దేవరకద్రలో జీఎంఆర్ దూకుడు....**
**ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న రహదారులు, బ్రిడ్జిల నిర్మాణానికి భారీగా నిధులు మంజూరు..**
**కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి..**

దేవరకద్ర జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి, సెప్టెంబర్ 10:దేవరకద్ర నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్ రావు, అడ్డాకుల కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు.ఎన్నో ఏళ్లుగా పరిష్కా రానికి నోచుకోని రహదారులు, బ్రిడ్జిల సమస్యలకు ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ప్రత్యేక చొరవతో శాశ్వత పరిష్కారం లభిస్తోందని పేర్కొన్నారు.1000 రోజుల్లో 1000 కోట్ల రూపాయల అభివృద్ధి పనులు సాధించిన ఘనత దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డికే దక్కుతుందని మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, టిపిసిసి ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్ రావు అన్నారు. కౌకుంట్ల మండల కేంద్రంలో కౌకుంట్ల, అడ్డాకుల మండలాల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పత్రికా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కౌకుంట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాదిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. కౌకుంట్ల, ఇస్రంపల్లి, పెద్ద మునగల్చేడ్, రాచాల, రేకులంపల్లి, వెంకంపల్లి ప్రాంతాల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న రహదారులు, వంతెనల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారని తెలిపారు.-44 నుంచి ఇస్రంపల్లి, పెద్ద మునగల్చేడ్ మీదుగా కౌకుంట్ల వరకు రహదారి అభివృద్ధి, హెచ్ ఎల్ బీ నిర్మాణానికి రూ.35 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు.అదేవిధంగా వెంకంపల్లి?రేకులంపల్లి మార్గంలోని బ్రిడ్జి నిర్మాణానికి రూ.1 కోటి 80 లక్షలు,దేవరకద్ర?ఆత్మకూర్ పి డబ్ల్యూ డి రోడ్డులో కౌకుంట్ల?రాచాల, ఇస్రంపల్లి వద్ద బ్రిడ్జి నిర్మాణానికి రూ.5 కోట్ల 40 లక్షలు మంజూరైనట్లు వెల్లడించారు.వర్షాకాలంలో ఆయా ప్రాంతాల్లో రాకపోకలు నిలిచిపోవడం, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడం, కొన్ని సందర్భాల్లో ప్రాణ, పశు నష్టాలతో పాటు విద్యుత్ స్తంభాలు, మోటార్లు, పైప్‌లైన్లు కొట్టుకుపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయని నాయకులు తెలిపారు.ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పలుమార్లు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్లారని, దీంతో ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసిందని పేర్కొన్నారు.ప్రజల కష్టాన్ని తన కష్టంగా భావించి, దశాబ్దాల సమస్యలకు పరిష్కారం చూపుతున్న ప్రజా నాయకుడు జి. మధుసూదన్ రెడ్డి అని కాంగ్రెస్ నాయకులు కొనియాడారు.ఈ అభివృద్ధి పనులకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కలకు కౌకుంట్ల, అడ్డాకుల మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల తరఫున ధన్యవాదాలు తెలిపారు.గత పదేళ్లుగా అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు ఇచ్చిన హామీలతో పోలిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నర సంవత్సరాల కాలంలో చేపట్టిన అభివృద్ధి, అమలు చేసిన హామీలపై చర్చ పెడితే వాస్తవాలు ప్రజలకు స్పష్టమవుతాయని కాంగ్రెస్ నాయకులు అన్నారు.గత పాలకుల తీరును ప్రజలు గమనించి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని వారు పేర్కొన్నారు.దేవరకద్ర నియోజకవర్గంలో



మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ.. రహదారులు, బ్రిడ్జిల నిర్మాణంతో ప్రజల రాకపోకల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తున్నామని కాంగ్రెస్ నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో అడ్డాకుల మండల పార్టీ అధ్యక్షుడు శ్రీహరి, కౌకుంట్ల సర్పంచ్ నరేష్ కుమార్, అడ్డాకుల గ్రామ సర్పంచ్ దశరథ్ రెడ్డి, విజయ్ మోహన్ రెడ్డి, వేగనాద్, ముచ్చింతల సర్పంచ్ వెంకటేశ్వర్ రెడ్డి, దేవరకద్ర నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షులు మొహమ్మద్ షఫీ,మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శకుంతల, ఓబీసీ అధ్యక్షుడు ఆంజనేయులు, కురుమూర్తి స్వామి మాజీ చైర్మన్ గోవర్ధన్ రెడ్డితో పాటు వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వీరనారి చాకలి ఐలమ్మకు ఘన నివాళి.

చిట్యాల,నల్లగొండ, జ్యోతి ప్రభంజనం,సెప్టెంబర్ 10:చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షుడు గోలి కిష్టయ్య నేతృత్వంలో చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. నాటి సామాజిక పరిస్థితుల్లో అణగారిన వర్గాల హక్కుల కోసం ధైర్యంగా నిలబడి పోరాడిన ఆమె తెగువను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొంతల చంద్రారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అంతటి నరసింహ, రజక సంఘం ప్రధాన కార్యదర్శి గుండెపూరి చంద్రయ్య, ఉపాధ్యక్షుడు గోలి నరసింహ, వార్డు సభ్యులు చిరుగోని శ్రీశైలం, లోడే చిరంజీవి, ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి, దేశబోయిన మంజుల, మల్లేష్, చింతకింది వెంకటేష్, మహంకాళి కుమారస్వామి పాల్గొన్నారు.అలాగే గ్రామ నాయకులు చీమల వీరేశం, వెల్ది రాఘవరెడ్డి, ఏనుగు సుధాకర్‌రెడ్డి,



దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాతి శ్రీనివాస్, కాటం సత్తయ్య, సుర్కంటి మోహన్‌రెడ్డి, ఆరూరి శ్రీనివాస్, దేశబోయిన నరసింహ, అంతటి రాజు, అంశాల శ్రవణ్‌కుమార్‌తో పాటు రజక సంఘం కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాములు, గోలి ఆంజనేయులు పాల్గొన్నారు.

printed and published by Rapolu Lingaswamy,onbehalf of printed at SMILYS ONLINE 6-7-48, Vanasthali Puram Shoping Complex, Dist:Rangareddy,stete:Telangana Editor: Rapolu Lingaswamy.pone:9908103501, PRGI NO:TGTEL/26/A6501 Email: rapolulingaswamy01@gmail.com